సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 17 । మార్చి । 2024



టన్ను చీనీ రూ.25 వేలు

అనంతపురంవ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

ఆదివారం	సోమవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.34	సెహరీ : 5.12



జనహితం.. జగన్ సైన్యం

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమతూకం
- అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో బీసీలకు పెద్దపీట
- రెండు లోక్‌సభ స్థానాలూ వారికే..
- అసెంబ్లీ స్థానాల్లోనూ ముగ్గురు బీసీలకు చోటు
- కదిరిలో మరోసారి మైనార్టీలకు అవకాశం
- రెండు ఎస్సీ రిజర్వుడు స్థానాల్లోనూ నిరుపేదలకు పట్టం
- అనుభవజ్ఞులకూ పెద్దపీట వేసిన జగన్



మాలగుండ్ల శంకర నారాయణ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాజకీయాల్లో సరికొత్త చరిత్రకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారు. నా ఎస్సీ, నా బీసీ, నా మైనార్టీ అని చెప్పడంతో పాటు చేతల్లోనూ సామాజిక న్యాయం చూపించారు. బడుగు, బలహీన వర్గాలను చట్టసభల్లో సగౌరవంగా కూర్చోబెట్టేందుకు తొలి అడుగు వేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేసే ఉమ్మడి అనంతపురం జిల్లా అభ్యర్థులను శనివారం వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలనూ బీసీలకే కేటాయించారు. అనంతపురం పార్లమెంట్ స్థానం నుంచి కురుబ సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణకు అవకాశం కల్పించారు. అలాగే హిందూపురం పార్లమెంట్ స్థానం నుంచి బోయ సామాజిక వర్గానికి చెందిన జోళదరాశి శాంతమ్మను బరిలోకి దింపుతున్నట్లు ప్రకటించారు.

జయహో బీసీ

సామాజిక సమీకరణాలు, ప్రజల మనోభావాలను బేరీజు వేసుకుని సుదీర్ఘ కసరత్తు అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బీసీలు, ఎస్సీలు, మైనార్టీలకు 50 శాతం సీట్లను కేటాయించి బడుగులకు రాజ్యాధికారం అప్పగించే దిశగా అడుగులు వేసింది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు సీట్లు కలిపి మొత్తం 16 సీట్లు ఉండగా, 8 సీట్లు బీసీ, ఎస్సీ, మైనార్టీలకు కేటాయించింది. తద్వారా ఆయా వర్గాల అభ్యున్నతిపై సీఎం జగన్ తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. అసెంబ్లీ స్థానాల్లో మూడు సీట్లు బీసీలకు కేటాయించారు. అందులో పెనుకొండ నుంచి కేవీ ఉషశ్రీ చరణ్ (కురుబ), కళ్యాణదుర్గం నుంచి తలారి రంగయ్య (బోయ), హిందూపురం నుంచి దీపిక (కురుబ) ఉన్నారు. ఇక రెండు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాల(శింగనమల, మడకశిర)నూ నిరుపేదలకు ఇచ్చారు. కదిరి అసెంబ్లీ సీటు 2014 తర్వాత మళ్లీ మైనార్టీలకు కేటాయించారు. మక్బూల్ అహ్మద్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. అన్నింటా అక్కచెల్లెమ్మలకు ప్రాధాన్యం ఇచ్చే వైఎస్ జగన్ ముగ్గురు మహిళలను ఎన్నికల బరిలో నిలిపారు.

పేదలకు పెద్దపీట

రూ.కోట్లు ఇస్తే కానీ సీటు ఇవ్వలేమని టీడీపీ తెగేసి చెబుతుండగా..వైఎస్ జగన్ మాత్రం పేదలంతా నా వాళ్లే అంటున్నారు. అందువల్లే ఈసారి ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో ఇద్దరు నిరుపేదలను ఎన్నికల బరిలో నిలిపి రికార్డు సృష్టించారు. మడకశిర అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ ప్రకటించిన ఈర లక్కప్ప (మాదిగ) నిరుపేద. ప్రస్తుతం రెండు గదుల పక్కా గృహంలో ఉంటున్నారు. అలాంటి వ్యక్తికి జగన్‌మోహన్‌రెడ్డి పిలిచి మరీ టికెట్ ఇవ్వడం విశేషం. శింగనమల అభ్యర్థిగా ప్రకటించిన వీరాంజనేయులు కూడా సాధారణ దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన వారు. ఆస్తులేమీ లేవు.అలాంటి వ్యక్తికి టికెట్ ఇవ్వడంతో జగన్ చిత్తశుద్ధిని అందరూ కొనియాడుతున్నారు.


తొలిసారి అసెంబ్లీ బరిలోకి..

పలువురు వైఎస్సార్ సీపీ అభ్యర్థులు తొలిసారి అసెంబ్లీ బరిలో నిలుస్తున్నారు. గతంలో ఎంపీగా పని చేసిన తలారి రంగయ్య ఈసారి అసెంబ్లీ పోరులో నిలిచారు. అలాగే టీఎన్ దీపిక, వీరాంజనేయులు, ఈర లక్కప్ప, మక్బూల్ అహ్మద్ మొదటి సారి ఎన్నికల బరిలో నిలిచారు.

అనుభవానికి ప్రాధాన్యం

సీట్ల కేటాయింపులో అనుభవానికీ ప్రాధాన్యం ఇచ్చారు. అనంతపురం అర్బన్ నుంచి పోటీ చేస్తున్న అనంత వెంకట్రామిరెడ్డి నాలుగు సార్లు ఎంపీగా పనిచేశారు. 2019లో అసెంబ్లీ బరిలో నిలిచి గెలిచిన ఆయన... తాజాగా రెండోసారి అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. ఇక ఉషశ్రీ చరణ్, దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వంటి అనుభవజ్ఞులకూ మళ్లీ అవకాశం ఇచ్చారు.





అనంతపురం ఎమ్మెల్యే అభ్యర్థులు

1. అనంతపురం అర్బన్ : అనంత వెంకటరామిరెడ్డి
2. రాప్తాడు : తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
3. గుంతకల్లు: యల్లారెడ్డిగారి వెంకటరామిరెడ్డి
4. ఉరవకొండ : యల్లారెడ్డిగారి విశ్వేశ్వరరెడ్డి
5. తాడిపత్రి : కేతిరెడ్డి పెద్దారెడ్డి
6. కళ్యాణదుర్గం: తలారి రంగయ్య
7. రాయదుర్గం: మెట్టు గోవిందరెడ్డి
8. శింగనమల (ఎస్సీ): మన్నెపాకుల వీరాంజనేయులు

శ్రీసత్యసాయి జిల్లా ఎమ్మెల్యే అభ్యర్థులు

9. పెనుకొండ: కేవీ ఉషశ్రీ చరణ్
10. ధర్మవరం : కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
11. పుట్టపర్తి : దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
12. మడకశిర (ఎస్సీ): ఈర లక్కప్ప
13. హిందూపురం: టీఎన్ దీపిక
14. కదిరి : బాపనపల్లి షేక్ మక్బూల్ అహ్మద్

ఎంపీ అభ్యర్థులు

అనంతపురం
మాలగుండ్ల శంకరనారాయణ (కురుబ)

హిందూపురం
జోళదరాశి శాంతమ్మ (బోయ)



జోళదరాశి శాంతమ్మ

న్యూస్‌రీల్

నేడు గ్రూప్-1 ప్రిలిమ్స్

- నిర్దేశిత సమయానికి నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష జరగనుంది. ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా 33 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 11,587 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు: పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 08554- 220009 నంబర్‌కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చాన్నారు. పరీక్ష రెండు సెషన్లు జరుగుతుందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మొదటి సెషన్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండో సెషన్ ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులను గ్రేస్ టైమ్‌తో కలిపి ఉదయం 9.45 గంటల వరకూ, మధ్యాహ్నం 1.45 గంటల వరకూ కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. నిర్దేశిత సమయానికి నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలన్నారు.

ప్రమాణాలతో కూడిన విద్యనందించడమే లక్ష్యం

ప్రశాంతి నిలయం: సత్యసాయి విద్యాసంస్థలలో విద్యార్థులకు చక్కటి ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే తమ లక్ష్యమని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు పేర్కొన్నారు. పట్టణంలోని ఈశ్వరమ్మ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో 11 ,12 తరగతులకు ఇటీవల నిర్మించిన 8 తరగతి గదులు, భౌతిక,రసాయన, జీవశాస్త్ర ల్యాబ్‌లు, ప్రార్థనా మందిరాన్ని సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తితో కలసి ప్రారంభించారు. సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ లర్నింగ్ వైస్ చాన్స్‌లర్ రాఘవేంద్రప్రసాద్, ఈశ్వరమ్మ పాఠశాల ప్రిన్సిపాల్ శివరామ క్రిష్ణయ్య,సిబ్బంది పాల్గొన్నారు.

అమల్లోకి ఎన్నికల కోడ్

- బ్యానర్లు, హోర్డింగ్‌లు తొలగింపు
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ అరుణ్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. వెంటనే రాజకీయ పార్టీల ప్రకటనలకు సంబంధించిన హోర్డింగ్‌లు, బ్యానర్లు తొలగించాలని అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన... నియోజకవర్గాల ఎన్నికల అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా అంతటా శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి జూన్ 15 వరకూ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన హోర్డింగ్‌లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు 24 గంటల్లోపు తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులపై ఉన్న అన్ని రకాల వాల్ రైటింగ్‌లు, కటౌట్లు, జెండాలు తొలగించాలన్నారు. వివిధ రాజకీయ నాయకుల విగ్రహాలకు వస్త్రాలను కప్పి ఉంచాలన్నారు.

కలెక్టరేట్ లో కంట్రోల రూం ఏర్పాటు..

ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించడానికి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకు అనుగుణంగా అన్ని నియోజకవర్గాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలన్నారు. మండల స్థాయిలో ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలయ్యేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు ఎంసీసీ బృందాలు పనిచేయాలన్నారు. అభ్యర్థుల వ్యయం, ప్రకటనల ఖర్చు, ప్రచారాలు తదితర కార్యక్రమాల పర్యవేక్షణకు వివిధ బృందాలు పని చేస్తాయన్నారు. నిబంధనలకు లోబడి ప్రకటనలు జారీ చేయాలన్నారు. నామినేషన్ ఇతర అంశాలకు సంబంధించి అనుమతులు ఇచ్చేందుకు సింగిల్‌విండో విధానం అమలు చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో రూ.50 వేలకు మించి నగదును ఎవరూ తీసుకెళ్లకూడదన్నారు. వ్యాపార కార్యకలాపాలకు సంబంధించి నగదు తీసుకువెళ్లాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్..

రాష్ట్రంలో ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందని కలెక్టర్ తెలిపారు. అన్ని ప్రక్రియలు అప్పటి నుంచే మొదలవుతాయన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. నామినేషన్ విత్‌డ్రాకు ముందు 10 రోజుల ముందు వరకూ నూతన ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఇందుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

- ఏప్రిల్ 18- గెజిట్ నోటిఫికేషన్
- నామినేషన్ల గడువు- ఏప్రిల్ 25
- ఏప్రిల్ 26- నామినేషన్ల పరిశీలన
- ఉపసంహరణ- ఏప్రిల్ 29 వరకూ
- మే 13- పోలింగ్
- జూన్ 4- ఓట్ల లెక్కింపు

అసెంబ్లీ బరిలో ఉపాధి కూలీ

- మడకశిర నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఈర లక్కప్ప
- సామాన్యుడికి అవకాశాన్ని కల్పించిన వైఎస్ జగన్



ఈరలక్కప్ప(ఫైల్)

మడకశిర: బడుగు, బలహీన వర్గాలకు పట్టం కడుతున్న వైఎస్ జగన్ మడకశిర ఎస్సీ రిజర్వుడ్ అసెంబ్లీ స్థానం నుంచి ఓ సామాన్యుడిని బరిలో నిలిపారు. ఉపాధి హామీ కూలీ ఈర లక్కప్పకు టికెట్ ప్రకటించి చరిత్ర సృష్టించారు. రెండు నెలల క్రితమే మడకశిర నియోజకవర్గ సమన్వయకర్తగా ఈర లక్కప్పను నియమించిన వైఎస్ జగన్.. అందరి అనుమానాలు పటాపంచలు చేస్తూ అసెంబ్లీ రేసులో నిలిపారు. వైఎస్ జగన్ చేస్తున్న ప్రయత్నాన్ని అందరూ అభినందిస్తున్నారు.

సమాజ సేవే పరమావధిగా..

గుడిబండ మండలం ఫళారం గ్రామానికి చెందిన లక్కప్ప, కదురమ్మ దంపతులకు 1976 జూన్ 8న ఈర లక్కప్ప జన్మించారు. బీఏ వరకు చదువుకున్న ఆయన నిరుపేద. అవివాహితుడైన ఆయన తల్లితో కలిసి ప్రభుత్వం ఇచ్చిన రెండు గదుల ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఉపాధి హామీ పనులకు వెళ్లే ఈర లక్కప్ప.. వీలు దొరకినప్పుడల్లా గుడిబండలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉంటూ ప్రజలకు అర్జీలు రాసిచ్చేవారు. 2015లో వైఎస్సార్ సీపీలో చేరిన ఆయన 2023 వరకు వైఎస్సార్ సీపీలో వివిధ హోదాల్లో కొనసాగారు. అంతకుముందు 2006 నుంచి 2011 వరకు గుడిబండ సర్పంచుగా పని చేశారు. అదే విధంగా 'మైరాడా ప్లాన్' ప్రాజెక్ట్ స్వచ్ఛంద సంస్థలో 10 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా పనిచేసి మంచి పేరు సంపాదించుకున్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



విలేకరులతో మాట్లాడుతున్న బోయ శాంతమ్మ

- హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మ

హిందూపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలనే రానున్న ఎన్నికల్లో తమను గెలిపిస్తుందని వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బోయ శాంతమ్మ అన్నారు. శనివారం ఆమె హిందూపురంలో విలేకరులతో మాట్లాడారు. ఎంపీ అభ్యర్థిగా తన పేరు ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఇంతవరకు ఏ ప్రభుత్వం చేయనంత అభివృద్ధి వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిందన్నారు. అలాగే కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. జగనన్న చేసిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలుపిస్తాయన్నారు. హిందూపురం పార్లమెంట్ పరిధిలో బోయ సామాజిక వర్గానికి రెండు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. అందువల్లే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తొలి సారిగా బోయ జాతిని గుర్తించారని, అందులోనూ మహిళనైన తనకు ఏకంగా లోక్‌సభకు పోటీ చేసే అవకాశం ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. మా జాతి తరపున వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలోనే బోయలకు గుర్తింపు లభించిందన్నారు. చెప్పిన మాట ప్రకారం జగనన్న 50 శాతం అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేటాయించారన్నారు. బీసీలకు పెద్దపీట వేయడంతో పాటు మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రాష్ట్రంలో ఏ గడపకు వెళ్లినా జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ విప్లవం కనిపిస్తోందన్నారు. తాము 'గడప గడపకూ' కార్యక్రమంలో ఎక్కడకు వెళ్లినా జనమంతా జగన్‌కే జై కొడుతున్నారన్నారు. మెండైన ప్రజాభిమానం కలిగిన తమ అధినేత ఆశీస్సులతో రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు అంఖడ విజయం సాధిస్తారన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబివుల్లా, బలరామిరెడ్డి, నియోజకవర్గ నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి, కౌన్సిలర్లు జయప్ప, ముస్తక్, ఆయుబ్, రోషన్, మల్లికార్జున, రహమత్‌బీ, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుపై వేట కొడవలితో దాడి

- ఆక్రమణదారుల ఘాతుకం



వేటకొడవలితో దాడి చేస్తున్న చంద్రకళ



చికిత్స పొందుతున్న శివన్న

రొళ్ల: తాను కొన్న పొలంలో అక్రంగా వేసుకున్న గుడిసెను తొలగించడానికి వెళ్లిన రైతుపై ఆక్రమణదారులు వేటకొడవలితో దాడి చేసి గాయపరిచారు. బాధితుడి కథనం మేరకు... రొళ్ల మండలం గిడ్డబొమ్మనహళ్లికి చెందిన నాగేగౌడు, రత్నగిరి బ్రహ్మదేవ్‌లకు చెందిన పొలం సర్వే నంబర్ 494లో 1.61 ఎకరాల భూమిని అగళి మండలం బీరనపల్లికి చెందిన శివన్న రెండేళ్ల క్రితం కొనుగోలు చేశాడు. 1బీ అడంగల్‌తో పాటు పట్టాదారు పాసుపుస్తకం కూడా పొందాడు. అయితే అదే గ్రామానికి చెందిన బసవరాజు, చంద్రకళ దంపతులు అదే భూమిలో గుడిసె వేసుకుని ఉన్నారు. ఆ భూమి తమకు చెందినదని వారు చెబుతున్నారు. గుడిసెను తొలగించి, తన భూమిని స్వాధీనం చేసి న్యాయం చేయాలని శివన్న రెవెన్యూ, పోలీసు అధికారులను కలిసి విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. శనివారం ఆక్రమిత గుడిసెను తొలగింపజేయడానికి జేసీబీతో వచ్చిన శివన్నను అప్పటికే కాపుకాచిన బసవరాజు, చంద్రకళలు విరుచుకుపడ్డారు. శివన్న రెండు చేతులు వెనక్కు లాగి తాడుతో కట్టేసి.. నేలపై పడేశారు. అనంతరం అతడి ఛాతీ, నుదుటిపై బసవరాజు పిడిగుద్దులు గుద్దగా.. చంద్రకళ వేట కొడవలితో మోకాళ్లపై విచక్షణారహితంగా దాడి చేసింది. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు... తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలో పడి ఉన్న శివన్నను రొళ్ల సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడి ఘటనపై శివన్న భార్య అమ్మాజక్క పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడు మృతి


మృతి చెందిన సత్యనారాయణ

తనకల్లు: చీకుల గుట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ దివ్యాంగుడు మృతి చెందాడు. మించల వారికోటకు చెందిన దివ్యాంగుడు సత్యనారాయణ (30) శనివారం వ్యక్తిగత పని మీద కొక్కంటిక్రాస్‌కు వచ్చాడు. పని ముగిసిన అనంతరం ఆటోలో స్వగ్రామానికి బయల్దేరాడు. చీకులగుట్ట వద్దకు రాగానే వేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న సత్యనారాయణ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో మహిళ బలవన్మరణం

లేపాక్షి: అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. ఏఎస్‌ఐ షర్ఫుద్దీన్ తెలిపిన మేరకు... బిసలమానేపల్లికి చెందిన అనసూయమ్మ (45), అశ్వత్థప్ప దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు. అనసూయమ్మ పదేళ్లుగా మూర్ఛవ్యాధితో బాధపడుతోంది. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో విరక్తి చెందింది. శనివారం ఉదయం ఇంటిలో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు చీరతో ఉరి వేసుకుంది. చుట్టు పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

అధ్యాపకులకు పదోన్నతులు

పుట్టపర్తి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న 54 మంది అధ్యాపకులకు ప్రభుత్వం ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పించింది. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాలో 12 మందిని రెగ్యులర్ ప్రిన్సిపాళ్లుగా నియమించిందని డీఐఈఓ రఘునాథరెడ్డి, ఆర్ఐఓ సురేష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

కిటకిటలాడిన ఖాద్రీశుని ఆలయం


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదలు అందజేసి అన్నదానం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వీరే



వైఎస్సార్‌సీపీ తరపున పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఖరారయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపీ నందిగం సురేష్ అభ్యర్థుల పేర్లను చదివి వినిపించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు సంబరాలను అంబరమంటించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని. భారీ మెజార్టీతో గెలుపొందుతామని ఈ సందర్భంగా అభ్యర్థులు ధీమా వ్యక్తం చేశారు.

పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గం



పేరు : కేవీ ఉషశ్రీచరణ్
విద్యార్హతలు: ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ
కుటుంబ వివరాలు : భర్త శ్రీచరణ్, కుమారుడు దివిజిత్ శ్రీచరణ్, కుమార్తె జైనా శ్రీచరణ్
రాజకీయ నేపథ్యం : 2014 నుంచి కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.
చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు: కరోనా మహమ్మారి విలయతాండవం చేసిన సమయంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించారు. ఆమె విశిష్ట సేవలను గుర్తించిన గోవా రాష్ట్ర ప్రభుత్వం అవార్డు సైతం అందజేసింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ తిరిగారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో రోడ్లు, ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టారు.
ఇతర వివరాలు : ప్రస్తుతం పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా పనిచేస్తూ కేడర్, ప్రజలతో మమేకమయ్యారు.

ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గం



పేరు : కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
విద్యార్హతలు : బీఈ (బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్)
కుటుంబ వివరాలు : తండ్రి మాజీ ఎమ్మెల్యే దివంగత కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి, తల్లి కళావతమ్మ, సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, సోదరి మౌనిక ఉన్నారు. భార్య పేరు కేతిరెడ్డి సుప్రియ. వీరికి ఒక కుమారుడు కేతిరెడ్డి జయ సూర్యప్రతాప్‌రెడ్డి ఉన్నారు.
రాజకీయ నేపథ్యం : కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తండ్రి సూర్యప్రతాప్‌రెడ్డిని ఫ్యాక్షన్ గొడవల నేపథ్యంలో ప్రత్యర్థులు 2006లో హత్య చేయడంతో తప్పనిసరి పరిస్థితులలో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అదే సంవత్సరం రాజకీయ రంగ ప్రవేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున 2009 ఎన్నికల్లో 19వేల పైచిలుకు మెజార్టీతో గెలుపొందారు. అలాగే వైఎస్సార్‌సీపీ తరపున 2019 ఎన్నికల్లో విజయం సాధించారు.
చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు : కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఎమ్మెల్యేగా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. పార్టీలకతీతంగా పేదలకు ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను 93శాతం మందికి అందజేసి రికార్డు సృష్టించారు. వ్యక్తిగతంగానూ పేద విద్యార్థుల చదువులకు సాయం అందించడం, అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం వంటివి నిరంతరం చేస్తున్నారు.
ఇతర వివరాలు: 'గుడ్‌మార్నింగ్ ధర్మవరం' పేరుతో నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యలు స్పాట్‌లోనే పరిష్కరిస్తూ రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

హిందూపురం లోక్‌సభ స్థానం



పేరు : జోళదరాశి శాంత
పుట్టిన తేదీ : 1973 జూన్ 1
కులం : వాల్మీకి (బోయ)
విద్యార్హత : ఇంటర్మీడియెట్
రాజకీయ నేపథ్యం : 2009 – 2014 మధ్యకాలంలో బీజేపీ తరపున బళ్లారి ఎంపీగా పని చేశారు.
కుటుంబ వివరాలు : తల్లిదండ్రులు బి.తిమ్మప్ప, బి.హొన్నూరమ్మ. భర్త నాగరాజు. ఒక కుమార్తె ఉన్నారు. సోదరుడు బి.శ్రీరాములు కర్ణాటక మంత్రిగా పని చేశారు.

పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గం



పేరు : దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి
విద్యార్హతలు : ఎమ్మెస్సీ
పుట్టిన తేదీ : 27-05-1970
కుటుంబ వివరాలు : భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె.
రాజకీయ నేపథ్యం: 2014లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున హిందూపురం ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2014-19 వరకు పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తగా పని చేశారు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు.
చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు : 2014లో దుద్దుకుంట ఫౌండేషన్ ప్రారంభించి పేద విద్యార్థుల చదువులకు ఆర్థికసాయం అందించారు. నియోజకవర్గంలో 40 వేల మందికి పైగా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్‌లు కూడా చేయించారు. ట్యాంకర్లతో ఐదేళ్ల పాటు 200 గ్రామాలలో తాగునీటిని అందించారు. ఎమ్మెల్యే అయిన తరువాత ప్రభుత్వ సహకారంతో జాతీయ రహదారులు,193 చెరువులకు నీళ్లిచ్చే పనులకు శ్రీకారం చుట్టారు.
ఇతర వివరాలు : ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషలు మాట్లాడగలరు. బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాలలో వ్యాపారాలు ఉన్నాయి.

కదిరి అసెంబ్లీ నియోజకవర్గం



పేరు: బాపనపల్లి షేక్ మక్బూల్ అహ్మద్
విద్యార్హతలు: బీటెక్
పుట్టినతేదీ : 20-07-1972
వయస్సు: 52 సంవత్సరాలు
కుటుంబ వివరాలు: భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె
రాజకీయ నేపథ్యం: గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ఈ పార్టీలో ఉంటున్నారు.
చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు: ఎంతోమంది పేద ముస్లింలను హజ్ యాత్రకు పంపించారు. పలు ఆలయాలు, మసీదులు, చర్చిల అభివృద్ధికి సొంత నిధులు ఇచ్చారు.
ఇతర వివరాలు: తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ, అరబిక్ భాషలు మాట్లాడగలరు. హజ్ యాత్రకు సంబంధించి ట్రావెల్ ఏజెన్సీ ఉంది. దుబాయ్, బెంగళూరు, ఇంకా పలు నగరాల్లో హోటళ్లు ఉన్నాయి.

రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గం



పేరు: తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
విద్యార్హతలు : బీఈ (బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్)
కుటుంబ వివరాలు : తల్లి ప్రేమ కుమారి, తండ్రి ఆత్మారామిరెడ్డి. భార్య మనోరమ, కుమారుడు సాయిసిద్ధార్థరెడ్డి, కుమార్తె ఇందిరా ప్రియదర్శిని.
పుట్టిన తేదీ: 06-06-1973
రాజకీయ నేపథ్యం: కళాశాల దశలో ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా పనిచేశారు. చదువు పూర్తయిన తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. 2009 సాధారణ ఎన్నికలలో రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి.. పరిటాల సునీతపై 1750 ఓట్ల స్వల్ప తేడాతో ఓడిపోయారు. అనంతరం వైఎస్సార్‌సీపీలో చేరారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా రాప్తాడు నుంచే పోటీ పరిటాల సునీత చేతిలో 7774 ఓట్ల తేడా ఓడిపోయారు. మూడో సారి కూడా రాప్తాడు నుంచే 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీచేసి టీడీపీ అభ్యర్థి పరిటాల శ్రీరామ్‌ను 25,575 ఓట్ల తేడాతో ఓడించారు.
చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు : కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు రాహుల్ ట్రస్ట్ పేరుతో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తర్వాత తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా రైతులకు బోర్లు వేయించడం, గొర్రెల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టారు.
ఇతర వివరాలు : తెలుగు, హిందీ, ఇంగ్లిష్, కన్నడ, తమిళం భాషలు మాట్లాడగలరు.

మడకశిర అసెంబ్లీ నియోజకవర్గం



పేరు : సుడిగాడి లక్కప్ప గారి ఈరలక్కప్ప
విద్యార్హతలు: బీఏ
పుట్టిన తేదీ: 08.06.1976
కుటుంబ వివరాలు: ఈరలక్కప్ప అవివాహితుడు. తల్లి కదురమ్మ, తండ్రి లక్కప్ప (లేట్), తమ్ముడు హనుమంతరాయప్ప (లేట్), అక్కలు నారమ్మ (లేట్), లక్ష్మీదేవి (లేట్).
రాజకీయ నేపథ్యం: 2006 నుంచి 2011 వరకు గుడిబండ సర్పంచ్‌గా పని చేశారు. 2015 నుంచి 2019 వరకు గుడిబండ మండల వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్‌గా పని చేశారు. 2019 నుంచి 2023 వరకు గుడిబండ మండల వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.
చేపట్టిన సామాజిక, అభివృద్ధి కార్యక్రమాలు: 1989 నుంచి 1999 వరకు మైరాడా ప్లాన్ ప్రాజెక్ట్ స్వచ్ఛంద సంస్థలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద వివిధ సమస్యలపై అధికారులకు చెప్పుకోవడానికి వచ్చే ప్రజలకు ఉచితంగా అర్జీలు రాసి ఇచ్చేవారు.
ఇతర వివరాలు: ఈయనకు గుడిబండ మండలం ఫళారం గ్రామంలో పక్కాగృహం మాత్రమే ఉంది. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. ఈయన ఉపాధి కూలీ కూడా. చింతపండు వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం



పేరు: తిప్పేగౌడ నారాయణ దీపిక
విద్యార్హతలు : ఎంసీఏ, (బెంగళూరు యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్సెస్ ప్రొఫెసర్‌గా పనిచేసేవారు.)
పుట్టినతేదీ : 28-04-1984
కుటుంబ వివరాలు : భర్త చిన్నక్క గారి వేణురెడ్డి.
రాజకీయ నేపథ్యం : టీఎన్ దీపిక భర్త వేణురెడ్డి 2003 నుంచి వైఎస్ రాజశేఖరరెడ్డి వీరాభిమానిగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థాపించినప్పటి నుంచి పార్టీలో పనిచేస్తున్నారు.
ఇతర వివరాలు : దీపిక తెలుగు, ఇంగ్లిష్, హిందీ, కన్నడ భాషలు మాట్లాడగలరు.

స్కాలర్‌షిప్పులకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి అర్బన్: కేంద్ర ప్రభుత్వం 2023-24 సంవత్సరానికి గాను ప్రీ మెట్రిక్ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు మంజూరు చేయడానికి ఆదేశాలు జారీ చేసిందని సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందు కోసం మాన్యువల్ స్కావెంజర్స్, చర్మం తీయువారు, తోళ్ల శుద్ధి చేయువారు, వ్యర్థ పదార్థాలు సేకరించే వారి పిల్లలు ఇందుకు అర్హులని తెలిపారు. వీరు గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుకున్న వారై ఉండాలని పేర్కొన్నారు. అర్హులు ఎవరైనా ఉంటే సచివాలయాల్లో ఎడ్యుకేషన్ అసిస్టెంట్, వార్డు అసిస్టెంట్ ద్వారా నవశకం లాగిన్‌లో ఏప్రిల్ 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 20వ తేదీ లోపు ఎంపీడీఓలు, కమిషనర్‌లు పరిశీలించి ఆమోదిస్తారన్నారు.

అమరజీవి జీవితం స్ఫూర్తిదాయకం


పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీ, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం స్ఫూర్తిదాయకమని ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఏఈ సుజాత పేర్కొన్నారు. శనివారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ఐలు చంద్రశేఖర్, రవికుమార్, సూపరింటెండెంట్ సరస్వతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చదువు, జ్ఞానంతో లోకం వికసిస్తుంది


పద్మశ్రీ అవార్డు గ్రహీత మకాం శ్రీధర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: చదువు, జ్ఞానం, సంస్కారంతో లోకం వికసిస్తుందని పద్మశ్రీ అవార్డు గ్రహీత మకాం శ్రీధర్, ఏపీ హైకోర్టు జడ్జి శ్రీనివాసలురెడ్డి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూరు మాజీ డీన్ ప్రొఫెసర్ యాడాటి నరహరి తెలిపారు. శనివారం హిందూపురంలోని ఎస్‌డీజీఎస్ కళాశాలలో 1973-76లో డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థి పద్మశ్రీ అవార్డు గ్రహీత మకాం శ్రీధర్‌కు ఘనంగా సన్మానం చేశారు. ముఖ్యఅతిథులుగా ఎస్‌డీజీఎస్ కళాశాల పూర్వ విద్యార్థులు ఏపీ హైకోర్టు జడ్జి శ్రీనివాసరెడ్డి, ప్రొఫెసర్ యడాటి నరహరి పాల్గొన్నారు. అవార్డు గ్రహీత మకాం శ్రీధర్ మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు రాకముందు, వచ్చినప్పుడు తనలో పెద్దగా తేడా ఏమీ రాలేదన్నారు. మనకు అవార్డులనేవి ప్రామాణికం కాదని, కష్టపడి పనిచేస్తూ ఫలితాలను రాబట్టాలని అన్నారు. బెంగళూరులోని చాణక్య యూనివర్సిటీ విద్యాప్రణాళికలో ఎస్‌డీజీఎస్ కళాశాలను ఆహ్వానిస్తున్నాయని అన్నారు. ప్రొఫెసర్ నరహరి మాట్లాడుతూ చదువుతోనే ప్రపంచాన్ని మార్చగలుగుతామని అన్నారు. పద్మశ్రీ మకాం శ్రీధర్ జాతీయ విద్యావిధానం -2020 రూపకల్పనలో ప్రధాన భూమిక పోషించారని, ఆయన సేవలను గుర్తించి కేంద్రం పద్మశ్రీతో సత్కరించడం హర్షణీయమన్నారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ లక్ష్యాన్ని ఎంచుకోవడం, ప్రయత్నించడం, చేరుకోవడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో మిట్టా పార్థసారథి, విద్యాసాగర్, జేపీకే రాము, శ్రీధర్, కళాశాల ప్రెసిడెంట్ చంద్రమోహన్, కార్యదర్శి బైసాని రాంప్రసాద్, కమిటీ సభ్యులు, ప్రిన్సిపాళ్లు జేఎస్‌వీఎస్ ప్రసాద్, నాగేంద్రకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఒంటిపూట బడులు

పుట్టపర్తి: జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు నిర్వహించాలని డీఈఓ మీనాక్షి ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పరీక్షలు జరిగే రోజుల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించాలని, తర్వాత వచ్చే సెలవు దినాల్లో బడులు నిర్వహించాలని ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా పాఠశాలల వద్ద ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేసుకుని, విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు.

వలంటీర్ల సంక్షేమ నిధికి రూ.25 లక్షల విరాళం


శివప్రసాద్

మడకశిర: నియోజకవర్గంలోని వార్డు, గ్రామ వార్డు వలంటీర్ల సంక్షేమ నిధికి మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ తనయుడు రొళ్ల వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ డాక్టర్ శివప్రసాద్ రూ.25 లక్షల విరాళం ప్రకటించారు. శుక్ర, శనివారాల్లో మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురంలో వైఎస్సార్‌సీపీ మేము సిద్ధం -మా బూత్ సిద్ధం సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో ఆయన మండలానికి రూ.5 లక్షల చొప్పున వలంటీర్ల సంక్షేమ నిధికి మొత్తం రూ.25 లక్షలు అందిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివప్రసాద్‌ను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప అభినందించారు.

సెల్‌ఫోన్ల రికవరీలో అనంత అగ్రస్థానం


రికవరీ చేసిన సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఎస్పీ

అనంతపురం: పోగొట్టుకున్న, చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీలో దేశంలోనే అనంతపురం జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. రూ.83 లక్షలు విలువ చేసే 311 సెల్‌ఫోన్లను బాధితులకు ఎస్పీ శనివారం అందజేశారు. వీటిలో మిస్ అయినవి 268 కాగా, చోరీకి గురైనవి 43 మొబైల్ ఫోన్‌లు ఉన్నాయి. ఇప్పటి దాకా 8,620 మొబైల్ ఫోన్లు రికవరీ చేశామని ఎస్పీ తెలిపారు. వీటి విలువ రూ.14.50 కోట్లు ఉంటుందన్నారు. జిల్లా ప్రజలకు సంబంధించిన మొబైల్ ఫోన్‌లు చోరీకి గురై అవి ఇతర రాష్ట్రాలకు చేరినా రికవరీలో రాజీపడలేదన్నారు. శనివారం అందజేసిన మొబైల్ ఫోన్లలో అనంతపురం జిల్లా నుంచి 259, శ్రీ సత్యసాయి జిల్లా నుంచి 31, కర్నూలు నుంచి 10, కర్ణాటక నుంచి 5, చిత్తూరు నుంచి 3, తెలంగాణ నుంచి 2, గుంటూరు జిల్లా నుంచి ఒక సెల్‌ఫోన్‌ను రికవరీ చేశామని వెల్లడించారు. మొబైల్ ఫోన్లు దొంగిలించే వారిపై ప్రత్యేక నిఘా వేసినట్లు పేర్కొన్నారు. చాట్‌బాట్ సేవల ద్వారా బాధితులకు సత్వర పరిష్కారం చూపుతున్నామని పేర్కొన్నారు. జిల్లా పోలీస్ సైబర్ విభాగం సీఐ షేక్ జాకీర్, సిబ్బందిని అభినందించడమే కాకుండా సెల్ ఫోన్‌ల రికవరీలో మంచి ప్రతిభ కనబరచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

దివ్యాంగులు మార్గదర్శకులు కావాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు, దివ్యాంగులు

పుట్టపర్తి అర్బన్: ఓటు హక్కు వినియోగించుకోవడంలో విభిన్న ప్రతిభావంతులు సామాన్యులకు మార్గదర్శకులు కావాలని డీఆర్‌ఓ కొండయ్య పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ 'స్పందన' సమావేశ మందిరంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు ప్రాధాన్యతపై దివ్యాంగులకు అవగాహన కల్పించారు. స్వీప్ నోడలాఫీసర్ శివరంగ ప్రసాద్, ఎన్నికల అధికారి మైనుద్దీన్, సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ వెంకటరమణ, దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకం ఏర్పడుతుందన్నారు. ఓటింగ్ శాతం పెంచడం కోసం ఎన్నికల కమిషన్ దివ్యాంగులకు పలు వెసులుబాట్లు కల్పించిందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపుల ఏర్పాటు, నడవ లేని వారికి మూడు చక్రాల కుర్చీ అందుబాటులో ఉంచడం, ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటోందన్నారు. ఇక 85 సంవత్సరాల వయసు దాటిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేయడానికి ఫారం 12డిని నోటిఫికేషన్ అనంతరం పోస్టల్ బ్యాలెట్ ద్వారా అధికారులు ఓటు హక్కు కల్పిస్తారన్నారు. అనంతరం ఓటర్లను చైతన్య పరిచే ప్రచార పోస్టర్లను విడుదల చేశారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

పుట్టపర్తి టౌన్: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) మధుసూదన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 30 వరకు జరగనున్న పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ హాల్ టికెట్‌ను కండక్టర్‌కు చూపిస్తే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారన్నారు. ఈ అవకాశం అన్ని పల్లె వెలుగు (ఆర్డినరీ) బస్సుల్లో ఉంటుందన్నారు. విద్యార్థులు ఉండే స్థానం నుంచి పరీక్షా కేంద్రం వరకు పరీక్ష రోజు, ఆ సమయంలోనే అనుమతి ఉంటుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోల పరిధిలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు.